క్లుప్తంగా

కల్యాణ వైభోగం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

నరసన్నపేట: నడగాం గ్రామంలో కోందడరామస్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం వైభవంగా జరుగుతోంది. ఇందులో భాగంగా సీతారాముల కల్యాణాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించగా భక్తులు కనులారా వీక్షించారు. అలాగే సాయంత్రం ఉమానీల కంఠేశ్వరస్వామి ఆలయ 61వ వార్షికోత్సవం నిర్వహించి పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు.

రేపట్నుంచి త్రినాథస్వామి ఆలయ వార్షికోత్సవం

సారవకోట: వడ్డినవలస గ్రామంలోని త్రినాథ స్వామి ఆలయ 66వ వార్షికోత్సవం ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. దీంట్లో భాగంగా తొలిరోజున లక్ష్మీనారాయణ, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, త్రినాథ స్వాముల వారి ఉత్సవ విగ్రహాల తిరువీధి ఉంటుందని అర్చకులు మనోజ్‌శర్మ శుక్రవారం తెలిపారు. అలాగే మూడు రోజుల పాటు ప్రత్యేక, విశేష పూజలు, వ్రతాలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని, స్వామివార్ల మూల విరాట్‌లను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు.

వరదగట్ల ఆక్రమణలపై సర్వే

కొత్తూరు: నేరడి రెవెన్యూ గ్రూపు పరిధి మెట్టూరు బిట్‌-1 ఆర్‌ఆర్‌ కాలనీకి ఆనుకొని ఉన్న వంశధార ప్రాజెక్టు వరద కాలువ ఆక్రమణకు గురౌతున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో వంశధార జేఈ లక్ష్మణరావు సమక్షంలో సిబ్బంది వరదగట్టుకు సమీపంలో ఉన్న పలు నిర్మాణాలను శుక్రవారం సర్వే చేసి వివరాలు నమోదు చేశారు. గతంలో ఎంతమేరకు భూములను సేకరించారో రికార్డుల ప్రాప్తికి పరిశీలించిలిస్తున్నట్లు అధికారులు చెప్పారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని జేఈ చెప్పారు.

ఉపాధి పనుల పరిశీలన

ఎల్‌.ఎన్‌.పేట: ఉపాధి హామీ పథకంపై వేతనదారులకు అవగాహన అవసరమని ఏపీవో వి.శ్రీదేవి అన్నారు. దబ్బపాడు (చిట్టిమండలం చెరువు), లక్ష్మీనర్సుపేట గ్రామాల్లో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. పని ప్రదేశంలో వేతనదారులతో రోజ్‌గార్‌ దివాస్‌ సమావేశాన్ని నిర్వహించారు. జాబ్‌ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదిలో వంద రోజులు పనులు కల్పిస్తామన్నారు. కొలతల ప్రకారం రోజూ రెండు పూటలా ఆరు గంటల పాటు పనిచేసి రూ.250 వేతనం పొందాలన్నారు. టీఏలు అప్పలనాయుడు, ఎం.రాధిక, ఎఫ్‌ఏలు ఉన్నారు.

సీడీపీవోగా పార్వతి



బాధ్యతలు స్వీకరిస్తున్న పార్వతి

సారవకోట: పాతపట్నం ఐసీడీఎస్‌ ప్రాజెక్టు సీడీపీవోగా కవిటి పార్వతి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సారవకోట ఐసీడీఎస్‌ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సారవకోట ప్రాజెక్టులో ఉన్న పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లోని 208 అంగన్వాన్‌ కేంద్రాలను పాతపట్నం ప్రాజెక్టుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొత్త ప్రాజెక్టులకు సీడీపీవోలను నియమించడంతో పాతపట్నం సీడీపీవోగా పార్వతిని పదోన్నతిపై అధికారులు నియమించారు.

పరీక్షంటే భయం వద్దు

హిరమండలం: పదో తరగతి విద్యార్థినులు పబ్లిక్‌ పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని స్థానిక కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎస్‌.కృష్ణవేణి అన్నారు. సాధారణంగా పాఠశాల స్థాయిలో రాసే పరీక్షలుగానే భావించాలన్నారు. స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు పదో మెట్టు అధిగమించడంపై శుక్రవారం అవగాహన కల్పించారు. కమిషనర్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌ ఎస్‌.సురేష్‌ కుమార్‌ పిల్లల కోసం పలు సూచనలు, సలహాలతో పంపించిన సందేశాన్ని విద్యార్థినులతో చదవించారు. ఒత్తిడిని జయించి ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సన్నద్ధమయ్యేలా కౌన్సెలింగ్‌ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

కొత్తూరు: ఖరీఫ్‌ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం రేవతి అన్నారు. కొత్తూరులో ప్రకృతి వ్యవసాయం సాగుపై ఏడీఏస్‌ బాబాజీ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం పెంచేందుకు ఇప్పటినుంచే రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తొలుత రైతులచే నవధాన్యాలు పచ్చిరొట్ట ఎరువుగా వేయించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువు ద్వారా పండించిన పంటలు ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు భూసారం పెరుగుతోందన్నారు.

జోరుగా వెల్‌నెస్‌ కేంద్రాల నిర్మాణం

నరసన్నపేట: మండలంలో వెల్‌నెస్‌ కేంద్రాల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయని పంచాయతీరాజ్‌ ఏఈ మోహనరావు తెలిపారు. కోమర్తి సచివాలయం పరిధిలో వెల్‌నెస్‌ కేంద్రం శ్లాబ్‌ వేసే పనులు శుక్రవారం చేపట్టగా వీటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో 22 వెల్‌నెస్‌ కేంద్రాలు మంజూరు కాగా వీటిల్లో 13 పూర్తయినట్టు చెప్పారు.

• అవగాహన



వేతనదారులకు వడదెబ్బపై సూచలిస్తున్న రామచంద్రరావు

వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పనులకు వెళ్లే ఉపాధి హామీ పథకం వేతనదారులు అప్రమత్తంగా ఉండాలని ఉర్లాం పీహెచ్‌సీ హెల్త్‌ సూపర్‌వైజర్‌ రామచంద్రరావు అన్నారు. ఎండలో పనులు చేయరాదని, ఏమాత్రం అలసట కనిపించినా తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని మతలబుప్పేట, చింతువానిపేటల్లో పనులు చేస్తున్న వేతనదారులకు వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పనిచేస్తున్నప్పుడు తగినన్ని మంచినీరు తాగాలన్నారు. - నరసన్నపేట

• పంపిణీ



పాతపట్నం: గురుకుల పాఠశాలలో స్లిప్పులు అందజేస్తున్న సిబ్బంది

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌ ఈ నెల 13న జరగనున్న నేపథ్యంలో అధికారులు తమకు కేటాయించిన విధుల్లో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ప్రహరాజపాలెంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల పాఠశాల, ప్రహరాజపాలెం, కోదూరు గ్రామాల్లో ఓటర్లకు స్లిప్పులను వీఆర్వో వేణు, సచివాలయ సిబ్బంది శుక్రవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో రెండు పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. - పాతపట్నం

• వైద్యం



పాతపట్నం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2లో బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్‌ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులకు బీపీ, సుగర్‌ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేపట్టి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, సచివాలయ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు. - పాతపట్నం

పోలింగ్‌ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు

• టెక్కలి సబ్‌కలెక్టర్‌ రాహుల్‌కుమార్‌రెడ్డి



కొత్తూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్‌ రాహుల్‌కుమార్‌



నరసన్నపేటలో పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శాంతి తదితరులు

కొత్తూరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్‌ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని టెక్కలి సబ్‌ కలెక్టర్‌ రాహుల్‌కుమార్‌ రెడ్డి అధికారులను ఆదేశించారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. కేంద్రం వద్ద ర్యాంపు బాగోలేని విషయాన్ని గుర్తించిన సబ్‌కలెక్టర్‌ రెండు రోజుల్లో బాగు చేయాలని తహసీల్దార్‌ పి.బాల, వీఆర్వో రాములకు సూచించారు. బోర్డులకు నలుపు రంగు వేసి వేరే రంగుతో అభ్యర్థుల పేర్లు రాయించాలన్నారు. డివిజన్‌లో ఏర్పాటు చేసిన పది పోలింగ్‌ కేంద్రాల్లో సుమారు పది వేలు మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. డీటీ వెంకటరావు, సీఐ వేణుగోపాలరావు, ఎస్సై ఎం.గోవింద ఉన్నారు.

పోలింగ్‌ కేంద్రం తనిఖీ

హిరమండలం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 22వ నంబర్‌ పోలింగు కేంద్రాన్ని సబ్‌ కలెక్టర్‌ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. కేంద్రం వద్ద మంచినీరు ఏర్పాటు చేయాలని, విద్యుత్‌కు అంతరాయం కలగకుండా ముందస్తుగా జనరేటర్‌ను అందుబాటులో ఉంచాలని, వేసవి దృష్ట్యా ఓటర్లకు ఎండ తగలకుండా టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ బి.మురళీమోహన్‌కు ఆదేశించారు. మండలంలో 760 మంది పట్టభద్రుల ఓటర్లకు స్లిప్‌లు అందజేయాలని సూచించారు. ఆయనతో పాటు రెవెన్యూ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యూఎస్‌ఎన్‌ మూర్తి ఉన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని ఆర్డీవో బి.శాంతి చెప్పారు. పోలింగ్‌ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్‌ ఎ.సింహాచలంకు పలు సూచనలు చేశారు. విద్యుత్‌, మరుగుదొడ్లు ఉండే విధంగా చూడాలని, సిబ్బందికి, ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. అవసరమైతే బయట టెంట్లు సమకూర్చాలని సూచించారు. అనంతరం తహసీల్దార్‌ కార్యాలయంలో ఎన్నికలపై సమీక్ష చేశారు.

పోలాకి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ కేంద్రాన్ని ఆర్డీవో బి.శాంతి పరిశీలించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం రెండు గదులు కేటాయించినట్లు తహసీల్దార్‌ శ్రీరాములు చెప్పారు.

వేగంగా రెండో విడత భూసర్వే

• సబ్‌ కలెక్టర్‌ రాహుల్‌ కుమార్‌ రెడ్డి



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న సబ్‌ కలెక్టర్‌ రాహుల్‌కుమార్‌రెడ్డి

హిరమండలం: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న రెండో విడత భూరీసర్వేను వేగవంతం చేయాలని టెక్కలి సబ్‌ కలెక్టర్‌ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హిరమండలం మండల పరిషత్‌ కార్యాలయ సమావేశ మందిరంలో కొత్తూరు, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఎస్‌లతో రీ సర్వేపై సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాలు, రెవెన్యూ గ్రామాల వారీగా రెండో విడతలో చేపట్టిన సర్వే ప్రగతిపై చర్చించారు. కొత్తూరు మండలంలో ప్రగతి తక్కువుగా.. ఉందని రెండు రోజుల్లో లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. సర్వే ప్రారంభించని గ్రామాల్లో తక్షణమే ఆరంభించాలన్నారు. రివ్యూ సమావేశాలు ఏర్పాటు చేస్తే కానీ పనులు ప్రారంభించరా అని రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రీ సర్వేలో ఎదురవుతున్న సమస్యలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టెక్కలి డివిజన్‌ పరిధిలో రెండో విడతలో 74 గ్రామాలకు 73 గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందన్నారు. వీటిలో 43 గ్రామాల్లో జీవీ పనులు, 32 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. ఇప్పటివరకు 14,934 ఎకరాలు సర్వే చేసినట్టు వివరించారు. జిల్లాలో మూడు డివిజన్ల పరిధిలో టెక్కలి డివిజన్‌ ముందంజలో ఉందన్నారు. రీ సర్వేలో ఒక్కో బృందం రోజుకు 20 ఎకరాలు సర్వే చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు బి.మురళీమోహన్‌, బాల, సత్యన్నారాయణ, ఉప తహసీల్దార్లు, సర్వేయర్లు ఉన్నారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ చిట్టిరాజు

నరసన్నపేట: గ్రామాల్లో జాబు కార్డులు అధికంగా ఉంటున్నాయని..అయితే వేతనదారులు చూస్తే ఆ స్థాయిలో పనులకు రావడం లేదని కారణం ఏమిటని డ్వామా పీడీ డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. లోపం ఎక్కడ ఉందని ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌, టెక్నికల్‌ అసిస్టెంట్లను నిలదీశారు. పనులకు వచ్చే వారికి కూడా వేతనం రూ. 200 వరకే వస్తోందని ఈ పద్ధతి మారాలన్నారు. లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నరసన్నపేటలో శుక్రవారం సాయంత్రం ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్‌ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన పంచాయతీల వారీగా సమీక్ష చేపట్టారు. కొన్ని పంచాయతీల్లో జాబు కార్డులతో పోల్చితే వేతనదారుల సంఖ్య తక్కువగా ఉందని.. అలాంటప్పుడు అన్ని జాబు కార్డులు దేనికన్నారు. పనికి రాని వారి జాబు కార్డులు తొలగించేద్దామన్నారు. రానున్న 23 రోజుల్లో పనులు రెట్టింపు కావాలని, వేతనదారులకు వచ్చే కూలి కూడా రూ. 250 తక్కువ ఉండకూదన్నారు. ఏపీడీ సైలజ, ఏపీవో యుగంధర్‌, మండల ఈసీ అప్పలరాజు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

• వైకేపీ ఏపీఎం రవిరాజ్‌



సభ్యులను విచారిస్తున్న రవిరాజ్‌

ఎల్‌.ఎన్‌.పేట: స్వయంశక్తి సంఘాలకు చెందిన పొదుపు, బ్యాంకు రుణాలు, స్త్రీనిధి అప్పుల చెల్లింపుల సమయంలో సభ్యులు, వారికి సేవలు అందించే ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని వైకేపీ ఏపీఎం ఎస్‌.రవిరాజ్‌ అన్నారు. ధనుకువాడ గ్రామంలో స్త్రీనిధి అప్పులు చెల్లింపు విషయంలో అక్రమాలు జరిగాయని స్వయంశక్తి సంఘాల సభ్యుల ఫిర్యాదు మేరకు ధనుకువాడలో స్త్రీనిధి బ్యాంక్‌ మేనేజర్‌ కె.సాయిరాంతో కలిసి శుక్రవారం విచారణ చేపట్టారు. వీరమణికంఠ స్వయంశక్తి సంఘంతో పాటు మరికొన్ని సంఘాలకు చెందిన స్త్రీనిధి ఖాతాల నుంచి గ్రూపు సభ్యులకు తెలియకుండా రూ.14 లక్షలు అక్రమాలకు పాల్పడినట్లు ఆయా సంఘాల సభ్యులు గుర్తించారు. వీవో బి.హేమలత బ్యాంకులకు చెల్లింపులు సక్రమంగా చేయలేదని, నిధులు అక్రమాలు జరిగాయని బాధిత సంఘాల సభ్యులు అంపోలు జగదీశ్వరి, కోంద్రు పుణ్యవతి, కొన్ని కళావతిలతో పాటు పలువురు సభ్యులు నాలుగు నెలల క్రితం మండల, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదుల మేరకు విచారణ చేస్తున్నామని అధికారులు చెప్పారు. బాధ్యులైన వారి వద్ద నుంచి నిధులు రికవరీ చేస్తామన్నారు.

ఎల్లమ్మకు ఎమ్మెల్యే పూజలు



పాతపట్నం: ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: కొరసవాడ గ్రామంలోన ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఎమ్మెల్యే రెడ్డి ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని పూజలు చేశారు. అలాగే బూరగాం గ్రామంలోని జడ్డమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ కార్యాక్రమంలో కూడా ఎమ్మెల్యే పాల్గొని, పూజలు నిర్వహించారు. నాయకులు మద్ది తాతయ్య, సర్పంచ్‌లు ఉమా, నల్లి జగదీశ్వరరావు ఉన్నారు.

ఘనంగా ఎల్లమాంబ జాతర

కొత్తూరు: నివగాం వద్ద సిర్లపోతన్న, ఎల్లమాంబ జాతర ఘనంగా జరిగింది. కొత్తూరు పరిసర గ్రామాలతో పాటు ఒడిశాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు స్పీకర్‌ పర్యటన

పొందూరు: మండల కేంద్రం పొందూరులో స్పీకర్‌ తమ్మినేని సీతారాం శనివారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్‌ తెలిపారు. జేవీఆర్‌ ఫంక్షన్‌ హాల్‌లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాయాల కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించనున్న సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం ఇన్‌చార్జి ఇందుకూరి రఘురాజు హాజరవుతారన్నారు. అందరూ హాజరు కావాలని కోరారు.

ప్రీతినాయక్‌కు నివాళి

సారవకోట: తెలంగాణ రాష్ట్రానికి చెందిన వైద్య విద్యార్థిని ప్రీతి నాయక్‌ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ కోరారు. ఆమె మృతికి సంతాపంగా మండల కేంద్రమైన నరసన్నపేటలో శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి వైద్య విద్యను అభ్యసిస్తున్న ప్రీతీ నాయక్‌ను హత్య చేశారని ఆరోపించారు. గిరిజన నాయకులు జన్ని రామారావు, తులసీ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి

ఆమదాలవలస రూరల్‌: ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబం అభివృద్ధి బాటలో నడుస్తుందని యూనియన్‌ బ్యాంక్‌ సీఎఫ్‌ఎల్‌ ఫీల్డ్‌ ఇన్‌చార్జి చిగురుపల్లి వెంకటేష్‌ అన్నారు. చీమలవలస గ్రామంలో ఉపాధి వేతనదారులకు ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబంలో ఉన్న సభ్యులు పొదుపు చేయడం వలన భవిష్యత్‌లో అవసరాలకు ఆసరాగా ఉంటుందన్నారు. బ్యాంకులు కల్పించే బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏటీఎం కార్డు వినియోగాలు, డిజిటల్‌ మోసాల గురించి వివరించారు. సైబర్‌ మోసాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ అసిస్టెంట్‌ జి.లలితకుమారి, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

సుధాకర్‌ను అధిక మెజారిటీతో గెలిపిద్దాం

• ఎన్నికల ప్రచారంలో నాయకులు



సరుబుజ్జిలి: మాట్లాడుతున్న చిరంజీవినాగ్‌



నరసన్నపేటలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సరుబుజ్జిలి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్‌ పిలుపునిచ్చారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, యువతతో సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావ పాల్గొన్నారు.

- సారవకోట: సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కూర్మనాథపురం, కేజేపురం, మత్రిపాడు, బంజీరుపేట గ్రామాల్లో సర్పంచ్‌ గోవిందరావు, నాయకులు గెల్లంకి అనీల్‌, రోణంకి ప్రభావతిలు పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు సుధాకర్‌కు వేయాలని కోరారు.
- హిరమండలం: సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్‌ అధ్యక్షుడు ఏవీ సురేష్‌ ఆధ్వర్యంలో మేజర్‌ పంచాయతీ హిరమండలంలో విస్తృతంగా ప్రచారం చేశారు.
- ఆమదాలవలస రూరల్‌: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు సువ్వారి గాంధీ అన్నారు. అక్కులపేట, శ్రీనివాసాచార్యులపేట పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- బూర్జ: పెద్ద లంకాం, చిన్న లంకాం, మామిడివలస, వైకుంఠ పురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు సువ్వారి గాంధీ పర్యటించి సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.
- నరసన్నపేట: సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేపట్టారు. నరసన్నపేట ఉప సర్పంచ్‌ ఎస్‌.కృష్ణబాబు, శిష్టకరణ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ సదాశివుని కృష్ణ, నాయకులు రాజాపు అప్పన్నఉన్నారు.
- మెళియాపుట్టి: సుధాకర్‌ విజయమే ధ్యేయంగా అందరూ పనిచేయాలని కాపు కార్పొరేషన్‌ చైర్మన్‌ మామిడి శ్రీకాంత్‌ అన్నారు. మండల కేంద్రంలోని పలువురు పట్టభద్రులను కలిసి సుధాకర్‌ను గెలిపించాలని కోరారు.

రామారావు విజయానికి కృషి చేయాలి



బ్యాలెట్‌ నమూనాను చూపిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జెడ్పీ చైర్‌పర్సన్‌ విజయ, ఎమ్మెల్సీ అభ్యర్థి రామారావు

• ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నర్తు రామారావు విజయానికి ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు కృషి చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజవర్గ పరిధిలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ నాయకులతో జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ పిరియా విజయ, ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావుతో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీన ఎన్నికలు టెక్కలి సబ్‌ కలెక్టర్‌ కార్యాలయంలో జరుగుతాయన్నారు. పార్టీకి చెందిన సభ్యులందరూ మొదటి ప్రాధాన్యత ఓటును రామారావుకు వేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ విజయ మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నాయకులతో కలిసి బ్యాలెట్‌ నమూనాను ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీపీ దోర సావిత్రమ్మ, మెళియాపుట్టి జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, పాతపట్నం, కొత్తూరు, మెళియాపుట్టి, హిరమండలం, ఎల్‌.ఎన్‌.పేట పీఏసీఎస్‌ అధ్యక్షులు ఎం.శ్యామ్‌సుందరరావు, సూర్యనారాయణ, ఉర్లాన బాలరాజు, ఎ.వి.సురేష్‌, కె.కృష్ణ, వైస్‌ ఎంపీపీ శోభారాణి, బైపోతు ఉదయ్‌, వై.వెంకటరమణ, యోగి, బాబూరావు, జయమునిరావు, జి.సూర్యం, చంద్రయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా భావించాలి

• పార్టీ పరిశీలకుడు రఘురాజు



మాట్లాడుతున్న రఘురాజు

ఆమదాలవలస: ఈ నెల 13వ తేదీన జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా భావించాలని శాసన మండలి ఎన్నికల పార్టీ పరిశీలకుడు ఇందుకూరి రఘురాజు అన్నారు. పార్టీ మద్దతు అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు అందరూ శ్రమించాలన్నారు. ఆమదాలవలస పట్టణంలోని స్పీకర్‌ క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్‌ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తతో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర ప్రజల ఆయువుపట్టయిన విశాఖపట్నం రాజధాని కోసం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న త్యాగాన్ని ప్రజలు మరువకుండా ఆ గొంతును మన ఎమ్మెల్సీ ద్వారా వినిపించేందుకు సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. చిరంజీవినాగ్‌ మాట్లాడుతూ.. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌ ఆశయాలకు అనుగుణంగా నాయకులంతా ముందడుగు వేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పీఏసీఎస్‌ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఓటరు కార్డుకు ఆధార్‌ అనుసంధానం వేగవంతం

పొందూరు: ఓటరు కార్డుకు ఆధార్‌ నంబర్‌ను అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేసి శతశాతం పూర్తి చేయాలని ఆమదాలవలస నియోజకవర్గం ఈఆర్‌వో టి.సవరమ్మ అన్నారు. తాడివలస, పొందూరు పోలింగ్‌ కేంద్రాల పరిధిలో ఆధార్‌ అనుసంధాన ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఆమెతో పాటు తహసీల్దార్‌ రాంబాబు, ఎన్నికల డీటీ మురళీధర్‌నాయక్‌, ఆర్‌ఐ రాధ ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పాతపట్నం: కొరసవాడ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మద్దు తవుడు అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం రాత్రి కొరసవాడ తవుడును పరామర్శించారు. సర్పంచ్‌లు జక్కర ఉమా, రాజారావు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

హిరమండలం: వంశధార నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వంశధార నది నుంచి అవలంగి గ్రామం వైపుగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ పట్టుబడినట్లు ఎస్సై జి.నారాయణ స్వామి తెలిపారు.

జీతాలు పెంచాలని వినతి

పాతపట్నం: జీతాలు పెంచాలని పాతపట్నం మేజర్‌ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కోరారు. ఈ మేరకు శుక్రవారం భిక్షటన చేస్తూ నిరసన తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కలిసి వినతి పత్రం అందజేశారు.

మహిళా చట్టాలు తెలుసుకోవాలి

కొత్తూరు: మహిళా చట్టాలను అందరూ తెలుసుకోవాలని కొత్తూరు కోర్టు సివిల్‌ జడ్జి ఎస్‌.మణి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రాజ్‌ శ్రీనివాస్‌ ఇంగ్లిషు మీడియం ఉన్నత పాఠశాలలో శుక్రవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

వంద పని దినాలు పూర్తి చేయాలి

పాతపట్నం: జాబ్‌ కార్డు కలిగిఉన్న ప్రతి కుటుంబం ఈ నెలాఖరులోగా వంద పని దినాలుపూర్తిచేసేలా సిబ్బంది బాధ్యత వహించాలి ఏపీడీ పంచాది రాధ అన్నారు. మండల కేంద్రంలోని చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. అన్ని ఎంచాయితీల్లో పనులు ప్రారంభించాలన్నారు.